క్లుప్తంగా

వేజండ్లలో ఉరుసు కార్యక్రమంలో మురళీకృష్ణ



వేజండ్ల(చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల లో సోమవారం రాత్రి నిర్వహించిన ఉరుసు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త అంబటి మురళీకృష్ణ హాజరయ్యారు. ముస్లిం మైనార్టీ నాయకులతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కాసు ఈశ్వరరెడ్డి, ఆళ్ల శ్రీరామిరెడ్డి, సందుల్లా, కరీముల్లా, ఆయూబ్‌ఖాన్, ఖాదర్‌ఖాన్, కరీముల్లా, సంధానీ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెంలో రూ.18 లక్షలు, రావిపాటివారిపాలెంలో రూ.10 లక్షలు, గనికపూడిలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లుకు శంకుస్థాపన చేశారు. సంక్రాంతి లోపల పనులను పూర్తి చేస్తామని బూర్ల వివరించారు.

చెరువులో నీళ్లు నీళ్లలా లేవు..

తిక్కిరెడ్డిపాలెంలో పర్యటించిన రామాంజనేయులు అదే గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. తాగే నీళ్లు ఉప్పగా ఉంటున్నాయి. చెరువులో నీళ్లు నీళ్లలా లేవు.. ఇప్పటి దాకా నాయకులు అడుగుతారని చూశాను. కానీ అడగలేదు. గతంలో మీరు మా ఊరు వచ్చినప్పుడు మంచినీళ్లు ఇస్తామని చెప్పారు. కానీ ఈ రోజుకీ అలానే ఉన్నాయంటూ.. అడుగుతుండగా స్థానికులు జోక్యం చేసుకున్నారు. దీంతో వృద్ధుడు నేనడుగుతున్నా.. అడిగితే మీరడగండి.. ఒక్కరు అడిగేవారు లేరంటూ.. అక్కడి నుంచి అసహనంతో వెళ్లిపోయాడు. సర్పంచ్ మాకినేని జగన్‌మోహన్, ఎంపీడీఓ కె. శివపార్వతి తదితరులతు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఈఓపీఆర్డీగా రవికుమార్



ప్రత్తిపాడు: ఈఓపీఆర్డీగా జి.రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొద్ది నెలల కిందట వరకు ఇక్కడ పనిచేసిన ఎం.మోషె ఉద్యోగ విరమణ చేయడంతో, నడింపాలెం పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజాకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా నూజెండ్ల మండలంలో ఈఓపీఆర్డీగా చేస్తున్న రవికుమార్‌ను ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధుల్లో చేరారు. ఎంపీడీఓ కె.శివపార్వతికి జాయినింగ్ ఆర్డర్‌ను అందించారు. పంచాయతీ కార్యదర్శులు నూతన ఈఓపీఆర్డీని కలసి అభినందనలు తెలిపారు.

పొన్నూరు డెప్యూటీ తహసీల్దార్‌గా రాజా రమేష్



పొన్నూరు: మండల డెప్యూటీ తహసీల్దార్‌గా కె.రాజా రమేష్ మోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ఫిరంగిపురం డీటీగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతగా విధులు నిర్వహిస్తానని అన్నారు.

పంచాయతీ రాజ్ ఏఈగా రవీంద్రరెడ్డి



కాకుమాను: కాకుమాను మండల పంచాయతీరాజ్ ఏఈగా రవీంద్ర రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన గుంటూరు ప్రధాన కార్యాలయంలో పని చేస్తు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన ఆనందరావు ఇంకొల్లు పీఆర్ ఏఈగా బదిలీ అయ్యారు.

వెలుగు ఏపీఎంగా సుజాత



కాకుమాను: స్థానిక వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు(ఏపీఎం)గా జి.సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె ఫిరంగిపురం ఏపీఎంగా విధులు నిర్వహిస్తు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో బాగంగా ఆమె కాకుమాను మండలం వచ్చారు. గతంలో ఇక్కడ ఏపీఎంగా పని చేసిన సోమశేఖర్ రొంపిచర్ల బదిలీ అయ్యారు.

ఆక్రమణల తొలగింపు దిశగా చర్యలు

తొలగనున్న ట్రాఫిక్ ఇక్కట్లు



బాపట్ల రోడ్డులో దుకాణాల వద్ద కొలతలు వేస్తున్న మున్సిపల్ అధికారులు

పొన్నూరు: పట్టణంలో కొందరు వ్యాపారులు రోడ్డు మార్జిన్లను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో ప్రధాన రహదారుల్లో పార్కింగ్ సమస్య తీవ్రంగా మారింది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆక్రమణల కారణంగా వాహనాల రాకపోకలు నియంత్రించడం కష్టతరమవుతోంది. ట్రాఫిక్ రద్దీతో ప్రజల పడుతున్న ఇబ్బందులను తెలియజేస్తూ సాక్షిలో ఇటీవల పలు కథనాలతో సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. ఈ సమస్య పరిష్కారంపై పురపాలక సంఘం దృష్టి సారించి ఆక్రమణల తొలగింపునకు నడుం బిగించింది. కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు నిర్ణయం మేరకు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆక్రమణల తొలగింపుపై అధికారులు దృష్టి సారించారు.

రహదారికి రెండు వైపులా..

ఐలాండ్ సెంటర్, ముబారక్ నగర్, ఎస్వీబీ రోడ్డు, బాపట్ల, రేపల్లె రోడ్డులో ఫ్రూట్స్, ఫాస్ట్ ఫుడ్, ఫ్యాన్సీ, ఎలక్ట్రికల్, ఫర్నిచర్, గృహోపకరణాలకు సంబంధించిన దుకాణాలు అధికంగా ఉన్నాయి. వినియోగదారులను ఆకర్షించేందుకు దుకాణం వద్ద కనీసం పది అడుగులు ముందుకు వచ్చి రోడ్డు మార్జిన్లో సామగ్రి, గృహోపకరణాలను ప్రదర్శిస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి.

రోడ్డుకు రెండు వైపులా ఒకరిని మించి మరొకరు వ్యాపారులు ముందుకు రావడంతో రహదారి మొత్తం ఆక్రమణకు గురై వాహనాలు తప్పించుకునే పరిస్థితి లేదు. అధికారులు కఠినంగా చర్యలు తీసుకుంటే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదని భావించి చర్యలకు శ్రీకారం చుట్టారు.. మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో సచివాలయ ఉద్యోగులు, పట్టణ ప్రణాళిక అధికారులు చేపట్టిన తొలగింపు పనులు సజావుగా సాగుతున్నాయి.

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు



ప్రధాన రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. దుకాణాల పరిధిలో రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడతారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు సహకరించాలి.

– ముప్పాళ్ల రమేష్‌బాబు,
మున్సిపల్ కమిషనర్, పొన్నూరు

ఎమ్మెల్సీ ఓటరు సహాయ కేంద్రం ప్రారంభం



చేబ్రోలు కేంద్రంలో ఎమ్మెల్సీ ఓటరు పత్రాలు ప్రదర్శిస్తున్న టీచర్లు

చేబ్రోలు: చైతన్యవంతులైన పట్టభద్రులు ప్రజా పక్షం వహించే ప్రజా మేధావులను ఓటు వేసి చట్టసభలకు పంపడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. చేబ్రోలు యూటీఎఫ్ మండల కార్యాలయంలోని ఉపాధ్యాయ భవన్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చి నెలలో జరగనున్న కృష్ణ- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలలో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే విజయ రాజు, పి.పార్థసారథి కోరారు. 2021వ సంవత్సరం, అక్టోబర్ 31వ తేదీ లోగా డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులందరూ నవంబర్ 6 లోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా ఓటర్‌గా నమోదు చేసుకోవచ్చనని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వై.రమేష్ బాబు, డి.నాగేశ్వరరావు, ఎల్ఎన్ సహదేవుడు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. పొత్తూరు సమీపంలో హైవేపై ఆదివారం రాత్రి సమయంలో సుమారు 50–55 సంవత్సరాలు కలిగిన వ్యక్తి మృతి చెంది పడిఉన్నాడని స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారని పరిశీలించారు. మృతుడు గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో రెండుకాళ్లు విరిగిపోయి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

పొట్టేల్ చిత్ర బృందం సందడి



నంబూరు వీవీఐటీలో సందడి చేస్తున్న పొట్టేల్ చిత్ర బృందం



చిత్ర బృందాన్ని సన్మానిస్తున్న ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల ప్రతినిధులు

పెదకాకాని: గ్రామీణ నేపథ్యంతో యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో రూపొందుతున్న పొట్టేల్ చిత్ర బృందం సోమవారం వీవీఐటీలో సందడి చేసింది. మండలంలోని నంబూరు వీవీఐటీని అక్టోబర్ 25వ తారీఖు విడుదల కానున్న పొట్టేల్ చిత్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా చిత్రబృందం సందర్శించింది.

ఆర్‌వీఆర్‌జేసీలో..

గుంటూరు రూరల్: స్ఫూర్తినిచ్చే సందేశాత్మక చిత్రాలు ప్రేక్షక ఆదరణతో పాటు అవార్డులను సాధిస్తాయని, వాస్తవాలు ప్రతిబింబించేలా మంచి కథనాలతో కూడిన చిత్రాలను సినీ పరిశ్రమ ప్రోత్సహించాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. ఈనెల 25న విడుదల కానున్న పొట్టేల్ తెలుగు చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం చౌడవరంలోని చిత్ర బృందం సందడి చేసింది.

నటీనటులు యువ చంద్ర, అనన్య నాగళ్ళ మాట్లాడుతూ సినిమాను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.



సారొస్తున్నారని..

పంచాయతీ అధికారులు ఎమ్మెల్యే పర్యటనలో అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన పచ్చని చెట్ల కొమ్మలను నరికేశారు. పల్లెకు పండుగ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తిక్కిరెడ్డిపాలెంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు హాజరయ్యారు. ఆయన రాకను పురస్కరించుకుని స్థానిక అధికారులు రోడ్డుకు రెండు వైపులా ఉన్న చెట్ల కొమ్మలను నరికెయ్యగా, మరికొన్ని చెట్లను వేళ్లతో సహా పెకలించివేశారు.

–ప్రత్తిపాడు



ఫిర్యాదులను వచ్చే వారానికి పరిష్కరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందజేస్తున్న అర్జీలను మరుసటి సోమవారానికి పరిష్కారం చేయాలని, నగరపాలక సంస్థ పరిధి కాని, పరిష్కారం చేయడానికి వీలులేని వాటికి విభాగాధిపతి తగిన వివరాలతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా, నాణ్యమైన పరిష్కారానికి విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సోమవారం ప్రజల నుంచి 35 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 8, రెవెన్యూ విభాగానికి 7, ప్రజారోగ్య విభాగానికి 5, అకౌంట్స్ విభాగానికి 6, ఉపా సెల్ విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువు లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ రవి, మేనేజర్ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

గుంటూరు నగరంలో ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యాన్ని అందించేందుకు 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నామని కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని 22 శానిటరీ డివిజన్లకు సీనియర్ అధికారులను పారిశుధ్యం పర్యవేక్షణకు విధులు కేటాయించినట్లు చెప్పారు. తమకు కేటాయించిన ప్రాంతాల్లో పారిశుధ్యంతో పాటు, తాగునీరు సరఫరా, రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలు గుర్తిస్తే తక్షణం తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో ప్రధాన వీధుల్లో ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్న ఆవులను బుధవారం నుంచి వెంగళాయపాలెంలోని జీఎంసీ బందెలదొడ్డికి తరలించి, రిజిస్టర్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు.

కార్మికులకు రక్షణ పరికరాలు అందజేత

గుంటూరు నగరపాలక సంస్థ పార్కు విభాగంలో విధులు నిర్వహించే కార్మికులకు రక్షణ పరికరాలను కమిషనర్ పులి శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల భద్రత కోసం హ్యాండ్ గ్లౌజులు, లాంగ్ బూట్లు, రెయిన్‌కోట్లు, హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలు అందజేయడం జరిగిందన్నారు.

అలరించిన మల్లాది సూరిబాబు గాత్ర కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజస్వామి కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం 46వ వార్షికోత్సవంలో భాగంగా వాగ్గేయకారుల సంగీత మహోత్సవాలు సోమవారం రెండో రోజుకి చేరాయి. సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ అధ్యక్షత వహించారు. ప్రముఖ విద్వాంసులు మల్లాది సూరిబాబు విశ్లేషణాత్మకంగా సంగీత మూర్తి త్రయ శిష్య, ప్రశిష్య వాగ్గేయకార రచనలను శ్రావ్యంగా ఆలపించారు. సంగీతాభిమానులను అలరించాయి. వయొలిన్‌పై ఎ.కామాక్షి(విజయవాడ), మృదంగంపై బుర్ర శ్రీరామ్(చెన్నై) చక్కని వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, వై.రాజ్యలక్ష్మి, ఫణితేజ పాల్గొన్నారు.

నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధికారులు

చేబ్రోలు: జిల్లా స్థాయిలో స్వర్ణాంధ్ర పోటీల్లో వివిధ అంశాల్లో నారాకోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి అవార్డులు పొందినట్లు హెచ్ఎం ఎం.ఏడుకొండలు సోమవారం తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్ – 2047 అనే అంశంపై గుంటూరు జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో 9వ తరగతికి చెందిన ఎస్‌కే నజ్మా(ప్రథమ), డిబేట్‌లో డి.ధరణి, కె.హారిక ప్రథమ స్థానం, ఎల్యుకేషన్ పోటీలో డి.ధరణి ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్ఎం తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్వో పి.రోజా, జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, ఆర్డీఓ కే శ్రీనివాసరావు, డీపీఎం ఏ లక్ష్మీ కుమారి విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగింది. చేబ్రోలు ప్రాంతానికి చెందిన పూర్ణ, బైక్‌పై గుంటూరు నుంచి చేబ్రోలు వైపునకు వస్తున్నాడు. మార్గమధ్యలో ద్విచక్ర వాహనంలో పెట్రోలు అయిపోయింది. దీంతో రోడ్డు పక్కన బైక్‌ను నడిపించుకుంటూ వస్తున్నాడు. పెట్రోలు బంక్‌లోకి వెళ్లే సమయంలో తెనాలి నుంచి గుంటూరు వెళ్తున్న బైక్ ప్రమాదశాత్తూ ఢీ కొట్టింది. ఈ ఘటనలో చేబ్రోలుకు చెందిన పూర్ణ, తెనాలి ప్రాంతానికి చెందిన శివకు గాయపడ్డారు. వీరిలో పూర్ణకు తలకు, కాళ్లు, చేతులకు గాయాలవటంతో పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గుంటూరు- తెనాలి రోడ్డులో వెంకటకృష్ణాపురం గ్రామ శివారులో ఏర్పడిన గోతులు



నంబూరు వెళ్లే రోడ్డు కోతకు గురై రోడ్డు మధ్యలోనే పడిన గొయ్యి



నంబూరు వెళ్లే రోడ్డుపై గోతులు పడటంతో సూచికగా చెట్టు కొమ్మలు, ముళ్లకంచె అడ్డుగా పెట్టిన దృశ్యం

అడుగుకో గుంత



గుంటూరు తెనాలి రోడ్డులో వెంకటకృష్ణాపురం గ్రామ శివారులో ఏర్పడిన గోతులు

ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పెదకాకాని మండలంలోని ఇన్నర్‌రింగ్ రోడ్డు, గుంటూరు నుంచి నందివెలుగు మీదుగా తెనాలి వెళ్లే రోడ్డు, హైవే నుంచి నంబూరు వెళ్లే రోడ్లు గోతులమయంగా మరాయి. గోతులు కనిపించేలా ఈ గోతుల్లో చెట్ల కొమ్మలు, ముళ్లకంచెలు, కట్టె పుల్లలు పెట్టి మరీ తెలియజేస్తున్నారు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

– పెదకాకాని